క్లుప్తంగా

రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన వారిని సత్కరిస్తున్న వేద యువజన సంఘం సభ్యులు, తదితరులు

గజపతినగరం: గుడివాడ కార్తికేయ నాల్గవ వర్ధంతి సందర్భంగా గజపతినగరం మండలం కెంగువ గ్రామంలో కార్తికేయ స్మారక విజ్ఞాన కేంద్రం ఆవరణలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 100మంది పాల్గొని రక్తదానం చేశారు. విజయనగరం బ్లడ్ బ్యాంక్ వారికి 50మంది, రోటరీ క్లబ్ విజయనగరం వారికి 50మంది రక్తదానం చేసినట్టు వేద యువజన సంఘం సభ్యులు తెలిపారు. కెంగువ వేద యువజన సంఘం నుంచి గుడివాడ అచ్చింనాయుడు, విజయ దంపతులు, బంధువులు, మిత్రులు, వివిధగ్రామాల నుంచి వచ్చిన యువకులు, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూ రూ.50,001

శృంగవరపుకోట: మండలంలోని సీతారాంపురం గ్రామంలో వరసిద్ధి వినాయక నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి లడ్డూ వేలం పాట వేయగా, గ్రామానికి చెందిన రెడ్డి చిన్నికృష్ణ, కొల్లి సతీష్, మిడతాన బైరాగినాయుడు, రాయవరపు దేముడు, పైడపునాయుడులు సంయుక్తంగా వేలం పాటలో గణపతి లడ్డూను రూ.50,001లకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిడతాన చిన్నంనాయుడు, ఎంపీటీసీ సన్యాసప్పడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

కొత్తవలస: మండలంలోని చీడివలస గ్రామంలో రైతులకు నానో యూరియా వినియోగంపై మండల వ్యవసాయధికారి కర్రి రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ నానో యూరియా వినియోగం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. వరి పంటకు కావల్సిన పోషకాలు నేరుగా మొక్కలకు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు గణేష్, ప్రసాదరావు, ఎంపీఈవో కుమారి పాల్గొన్నారు.

సురక్షిత నీరు సరఫరా చేయాలి

గుర్ల: గ్రామీణ ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలని పంచాయతీ కార్యదర్శి కల్యాణికి డీఎల్‌పీవో హేమసుందర్ ఆదేశించారు. మండలంలోని నాగళ్లవలస సచివాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌డబ్ల్యూపీసీలకు చెత్తను తరలించి సంపద సృష్టించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

నేడు జెడ్పీ చైర్మన్ జన్మదిన వేడుకలు

మెరకముడిదాం : మండలంలోని సోమలింగాపురం శ్రీ శేషసాయి ఆలయ ప్రాంగణంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మెగా రక్తదాన శిబిరం కూడా నిర్వహిస్తున్నట్టు నాయకులు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలనీ వారు కోరారు.

రైతు సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అప్పలనాయుడు, తదితరులు

గజపతినగరం రూరల్: రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడమే కాకుండా యూరియా అడిగితే బొక్కలో పెడతామని చెబుతున్న కూటమి ప్రభుత్వ తీరు సరికాదని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతన్నల సంక్షేమం కోరుతూ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా గ్రామాల్లోనే రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సకాలంలో ఎరువులను, విత్తనాలను అలాగే పంట సాయాన్ని వేసి రైతులను ఆదుకున్నారన్నారు. నేడు కూటమి పాలనలో యూరియా కావాలని రైతులు అడిగితే అడిగిన వాడిని బొక్కలో తోస్తామని బెదిరిస్తున్న కూటమి నాయకులను ఏమనాలో అర్థం కావడం లేదన్నారు. రైతుల సంక్షేమం కోరుతూ ఈ నెల 9వ తేదీన జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున బయలుదేరి ఆర్డీవో కార్యాలయాల వద్ద అధికారులకు వినతిపత్రం ఇస్తామన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, మండల నాయకులు మండల సురేష్, బెల్లాన త్రినాధరావు, కె.పైడపునాయుడు, గెద్ద తిరుపతి, శీర రమణ, దత్తిరాజేరు బూత్ కమిటీ మండల అధ్యక్షుడు ఫణీంద్ర, మండల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యా.. మీకు దండం.. మా భూములు మాకివ్వండి..



అయ్యా..! మీకు దండాలు.. మా భూములు మాకు ఇవ్వండి మహప్రభో.. అంటూ జిందాల్ నిర్వాసితులు వినూత్నంగా గురువారం తమ ఆందోళన కొనసాగించారు. – శృంగవరపుకోట

డ్రగ్స్ వద్దు బ్రో...



ధర్మవరం హైస్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఈగల్ టీమ్ సభ్యులు

శృంగవరపుకోట: డ్రగ్స్ వద్దు బ్రో.., మత్తులోన పడితే జీవితమే వ్యర్థం అయిపోతుంది అంటూ జిల్లా ఈగల్ టీమ్(పోలీసు) సభ్యులు గురువారం మండలంలో ధర్మవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూచించారు. ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ ఆదేశాలతో ధర్మవరం హైస్కూల్‌లో డ్రగ్స్ వద్దు బ్రో.. అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వాడకం వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. గంజాయి తాగటం సరదాగా ఆరంభమై తర్వాత అలవాటుగా మారి, ఆర్థిక నేరాలు, దోపిడీలు, హత్యలకు దారి తీస్తోందని, డ్రగ్స్ బారిన పడి ఎందరో అమాయకులు తమ జీవితాలను బలి చేసుకున్నారని హెచ్‌సీ విజయ్‌కుమార్, కానిస్టేబుల్ లక్ష్మణరావు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన సేవలు అందించాలి

చీపురుపల్లి: గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కర్లాం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ అన్నారు. మండలంలోని కర్లాం పీహెచ్‌సీలో గురువారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలు మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయిస్తారని వైద్యులు గుర్తు చేసుకోవాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో ఉండే ప్రజల వైద్య స్థితిగతులు ఆధారంగా అవసరమైన అన్ని మందులు ఫార్మసీలో సిద్ధంగా ఉండాలన్నారు. పీహెచ్‌సీల్లో ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణాన్ని సందర్శించారు. కమిటీ సభ్యులు సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి, తహసీల్దార్ డి.ధర్మరాజు, అలజంగి సర్పంచ్ రఘుమండ రమణమ్మ, వీఆర్వో ఆనందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, బాణాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న జెడ్పీ సీఈవో సత్యనారాయణ

గుర్ల: మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జెడ్పీ సీఈవో బివి.సత్యనారాయణ ఎంపీడీవో రవికుమార్‌కు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి పనులను జోరుగా చేపట్టాలని సూచించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆటో డ్రైవర్ల ఆందోళన



ఆటో డ్రైవర్ల నిరసన

గజపతినగరం రూరల్: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం వల్ల ఆటో డ్రైవర్లు రోడ్డెక్కి అప్పులు పాలవుతున్నారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పురం అప్పారావు అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో ఆటోడ్రైవర్లుతో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. ఉచిత బస్సు పథకంతో ఆటోలకు సర్వీసులు లేక నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్థికంగా చితికిపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నగర సూర్యనారాయణ, ఎస్.లక్ష్మణరావు, తాడ్డి రమేష్, ఎ.అప్పలాచారి తదితరులు పాల్గొన్నారు

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

చీపురుపల్లి: అసంఘటిత రంగ కార్మికులు అంతా ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎన్.విజయశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ప్రభుత్వ కార్మిక శాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం సెప్టెంబర్ 5 నుంచి 19 వరకు అసంఘటిత రంగ కార్మికులు తమ వివరాలు నమోదు చేసుకునేందుకు గడువు ఉందని తెలిపారు. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో అన్ని గ్రామ సచివాలయాల్లో ఉచిత నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అసంఘటిత రంగ కార్మికులతో పాటు వ్యవసాయ కార్మికులు, గిగ్ వర్కర్లు కూడా తమ వివరాలు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని 33/11కేవీ సామర్థ్యం గల సబ్‌స్టేషన్ నిర్వహణ పనులను శుక్రవారం నిర్వహించనున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గొల్జాం, క్లోంపూడి, సీతారాంపురం, లక్కవరపుకోట, ఖాసాపేట, తలారి, కొట్యాడ, కూర్మవరం, రంగరాయపురం, సంతపేట గ్రామాలతో పాటూ వేపాడ మండలం పాటూరు, బొద్దాం, కొత్తబొద్దాం, ఒబలయ్యపాలెం, ముకుందపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

సంక్షిప్తంగా...

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంత వద్ద ఉన్న కొల్లా నరసింహస్వామి సన్స్ ఎరువుల దుకాణంలో శ్రీకాకుళం నుంచి వచ్చిన విజిలెన్స్ సీఐ సింహాచలం గురువారం తనిఖీలు చేపట్టారు. ముందుగా ఏవో అనురాధతో కలసి గొడౌన్‌లో ఉన్న ఎరువులను తనిఖీ చేసిన అనంతరం రికార్డులు పరిశీలించారు. ఇప్పటి వరకు విక్రయించిన ఎరువులకు సంబంధించి రైతులకు ఇచ్చిన బిల్లులను పరిశీలించారు. బిల్లులు తప్పనిసరిగా కొనుగోలు దారులకు ఇవ్వాలని ఆదేశించారు.

ఘనంగా గురు పూజోత్సవం

గుర్ల: స్థానిక ఎమ్మార్సీ వద్ద ఎంఈవో ఎస్.భానుప్రకాష్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ, గాంధీజీ, సరస్వతి దేవి విగ్రహాలకు జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి సూర్యనారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు పూలమాలలు వేశారు. అనంతరం మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బెల్లాన బంగారునాయుడు, ఎంఈవో -2 శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామసభలు నిర్వహించండి

శృంగవరపుకోట: గ్రామ సభలను నిజాయితీగా నిర్వహించేలా ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆదేశించాలని ఓటరు అక్షరాస్యత వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం ఓ ప్రైవేటు భవనంలో నిర్వహించిన సమావేశంలో వేదిక అధ్యక్షుడు సూర్యారావు మాట్లాడుతూ ఈ నెల 15న అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం నిర్వహించాలని, విద్యార్థులకు ఓటు హక్కుపై చైతన్యవంతుల్ని చేయాలని తీర్మానించారు.

పలువురికి నేత్ర పరీక్షలు

వేపాడ: మండల కేంద్రంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 75 మందికి నేత్ర పరీక్షలు చేసినట్టు క్యాంపు కోఆర్డినేటర్ జోగారావు తెలిపారు. 45 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఆప్తాల్మిక్ దుర్గాభవాని, సిబ్బంది భాను పరీక్షలు చేశారు. ఆపరేషన్లకు ఎంపికైన వారిని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు.

రాజాంలో సీఐటీయూ జిల్లా మహాసభలు

లక్కవరపుకోట: రాజాంలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మహా సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఈ మహా సభల్లో కార్మికుల సమస్యలపైన చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు